
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025

I



సోమశిలలో 73.61 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 73.611 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 11,110 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,30,940
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.11,831
మూడు శాతం జీఎస్టీతో	రూ.12,186
నవర (8 గ్రాములు)	రూ.97,488

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 30.0 /25.5

జిల్లాలో అక్కడక్కడా భారీ వర్షాలు శుక్రవారం పడే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 95 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు



నెల్లూరు(బృందావనం): పవిత్రోత్సవాలను పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో నంది పూజ, వ్రత సమర్పణ, హోమం, దీపారాధన తదితర పూజా కార్యక్రమాలను వేడుకగా గురువారం నిర్వహించారు. ఉభయ కర్తలుగా గోపాలకృష్ణ, అంజలి, మద్దిన విశ్వనాథం, బృంద దంపతులు వ్యవహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.

19న ఆర్చరీ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా జూనియర్స్, సీనియర్స్ ఆర్చరీ జట్లను ఆదివారం ఎంపిక చేయనున్నామని ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని శాతవాహన కళాశాలలో నవంబర్ ఒకటి నుంచి మూడు వరకు నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనే వారిని ఎంపిక చేయనున్నామని వివరించారు. ఆధార్ కార్డు జిరాక్స్, ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని సూచించారు.

బాణసంచా దుకాణాల్లో తనిఖీలు




నెల్లూరు(క్రైమ్): దీపావళి నేపథ్యంలో పార్లుకట్టలోని బాణసంచా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలను పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అధికారులు సంయుక్తంగా గురువారం చేపట్టారు. రమణయ్యకు చెందిన శ్రీనివాస ట్రేడర్స్ దుకాణంలో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన రూ.25 వేల విలువజేసే లోకల్ మేడ్ టపాసులను గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకొని దుకాణదారుడిపై కేసు నమోదు చేశామని సంతపేట ఇన్‌స్పెక్టర్ సోమయ్య తెలిపారు. ఇన్‌చార్జి ఏడీఎఫ్ఓ శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాదంపై డిప్యూటీ డీఈఓ విచారణ



వింజమూరు(ఉదయగిరి): ఉపాధ్యాయ నేత, ఎంఈఓ మధ్య నెలకొన్న వివాదంపై స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కావలి డిప్యూటీ డీఈఓ హరిప్రసాద్ విచారణను గురువారం చేపట్టారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ – 1 రమేష్.. ఏపీటీఎఫ్ నేత కొండారెడ్డి మధ్య మాటల యుద్ధం జరిగిన నేపథ్యంలో డీఈఓకు వీరిద్దరూ ఫిర్యాదు చేశారు. ఈ తరుణంలో విచారణాధికారిగా డిప్యూటీ డీఈఓను నియమించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఎంఈఓల మధ్య విచారణ జరిపి ఇరువురికీ నచ్చజెప్పారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్య లేకుండా వ్యవహరిస్తామని సర్దుబాటు చేసుకున్నారు. దీంతో వివాదం సద్దుమణిగింది. నివేదికను డీఈఓకు పంపనున్నామని హరిప్రసాద్ తెలిపారు.

డీసీపల్లిలో 788 పొగాకు బేళ్ల విక్రయం



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 788 బేళ్లను గురువారం విక్రయించారని నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 1048 బేళ్లు రాగా.. 788ను విక్రయించగా, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారని చెప్పారు. 92,144.9 కిలోల పొగాకును విక్రయించగా.. రూ.1,39,64,620.20 వ్యాపారం జరిగిందని వివరించారు. గరిష్ఠ ధర కిలో ఒక్కింటికి రూ.315.. కనిష్ఠ ధర రూ.60.. సగటు ధర రూ.151.55గా నమోదైందని చెప్పారు. పది కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారన్నారు.

కూటమిలో రేషన్ కుంపట్లు

రేషన్ బియ్యం అక్రమ తరలింపు వ్యవహారం అధికారుల మెడకు చుట్టుకుంది. దీన్ని బొక్కేసిన అధికార పార్టీ నేతలను వదిలేసి ఆఫీసర్లను బలిపశువులను చేయనున్నారు. ప్రస్తుతం జరుగుతున్న వ్యవహారం దీనికి అద్దం పడుతోంది. మరోవైపు ఈ ఉదంతం కూటమి ప్రభుత్వంలో కలకలం రేపుతోంది. రేషన్ బాగోతంపై టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విమర్శలు చేయడం జనసేన నేతలను ఆగ్రహానికి గురిచేసింది. దీనిపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎదుట జరిగిన విచారణకు ఆ శాఖ అధికారులు, టీడీపీ నేతలు హాజరయ్యారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు చర్యలకు రంగం సిద్ధమైంది. ఇక నుంచి ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేదిలేదంటూ మంత్రి నారాయణ తీవ్రస్థాయిలో హెచ్చరికలనూ జారీ చేశారు.



రేషన్ బియ్యాన్ని తరలిస్తూ ఇటీవల పట్టుబడిన లారీలు

- అధికార అండతో పేట్రేగిపోతున్న మాఫియా
- ఆఫీసర్లను బలిపశువులను చేసేందుకు రంగం సిద్ధం
- చర్యలకు మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలు
- జిల్లా నేతలకు మంత్రి నారాయణ వార్నింగ్
- దోపిడీకి పాల్పడిన నేతలకు మందలింపులు
- పేదల బియ్యాన్ని బొక్కేసిన వారిపై కేసులేవీ

తొమ్మిది వేల మెట్రిక్ టన్నులు పక్కదారి

జిల్లాలో 7.21 లక్షల రేషన్ కార్డులు.. 1513 చౌకదుకాణాలున్నాయి. వీటి ద్వారా ప్రతి నెలా 12,500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఇందులో దాదాపు తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల బియ్యం అక్రమ రవాణా రూపంలో ఇతర రాష్ట్రాలు, విదేశాలకు తరలిపోతోంది. మరోవైపు వైఎస్సార్ కడప, ప్రకాశం, తిరుపతి తదితర జిల్లాల నుంచి బియ్యాన్ని నెల్లూరుకు అక్రమంగా తరలిస్తున్నారు. ఇలా ప్రతి నెల 15 వేల మెట్రిక్ టన్నులను సేకరిస్తున్నారని సమాచారం.

నెల్లూరు(పొగతోట): పేదల బియ్యం అక్రమ రవాణాలో రేషన్ మాఫియాకు పూర్తి స్థాయిలో సహకరించిన అధికారులు బలిపశువులు కానున్నారు. ఈ వ్యవహారంలో టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి బహిరంగంగా విమర్శలు చేయడం.. మంత్రి నాదెండ్ల మనోహర్ పేరును ప్రస్తావించడంతో కూటమి పార్టీల్లో కలకలం రేగింది. ఆపై పరోక్షంగా క్షమాపణలు చెప్పినా, మంత్రి నారాయణ సీరియస్ అయ్యారు. ఈ పరిణామాల క్రమంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎదుట జరిగిన విచారణకు ఆ శాఖ జిల్లా అధికారులు, టీడీపీ నేతలు హాజరయ్యారు.

సూత్రధారులను వదిలేశారు

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు అధికారులపై చర్యలు చేపట్టనున్నారు. మరోవైపు బియ్యం అక్రమ రవాణా ఉదంతంపై టీడీపీ నేతలకు మంత్రి నారాయణ మాస్ వార్నింగ్‌నూ ఇచ్చారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఏదంటే అది మాట్లాడితే సహించేదిలేదంటూ హెచ్చరికలు జారీ చేశారని సమాచారం. పేదల బియ్యం ద్వారా రూ.కోట్లల్లో దోపిడీకి పాల్పడిన నేతలను గట్టిగా మందలించారని తెలుస్తోంది. అయితే వీరిపై కేసులు పెట్టకుండా.. చిన్న వారిపైనే మోపుతున్నారు.

అందరికీ వాటాలు

కూటమి నేతల అండదండలతో రేషన్ మాఫియా పేట్రేగిపోతోంది. పేదల బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తూ భారీగా ఆర్జిస్తున్నారు. ఇందులో అందరికీ వాటాలను పంచుతున్నారు. ఈ వ్యవహారమంతా ఓ కీలక నేత ఆధ్వర్యంలో జరుగుతోంది. కూటమి సిండికేట్లో ఉన్న మాఫియా లీడర్ల వాహనాలను ఎవరూ ఆపరు. అదే ఇతర వ్యక్తులైతే నిమిషాల వ్యవధిలోనే అధికారులకు సమాచారం అందుతోంది. ఇంకేముంది పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నారు.

పట్టపగలే అక్రమ రవాణా

జిల్లాలో పట్టపగలే పేదల బియ్యం అక్రమంగా రవాణా అవుతోంది. బస్తాలను దింపి వాటిని పాలిష్ పట్టి బ్యాగుల్లో నింపుతున్నారు. అధికారులు, పోలీసులకు తెలిసినా, ఎవరూ ముందుకు రారు. ఫిర్యాదులొచ్చి వాహనాన్ని సీజ్ చేసి, ఒకవేళ అది సిండికేట్లోనిదైతే నాన్ పీడీఎస్‌గా నివేదికలిస్తున్నారు. దీనికి సహకరించిన అధికారులు ప్రస్తుతం ఇబ్బందుల్లో పడ్డారు. సిండికేట్లో ఉన్న నేత రైస్‌మిల్లులవైపు ఎవరైనా వస్తే తిట్ల పురాణం, బెదిరింపులు.. పైనుంచి ఫోన్లో చీవాట్లు పెడుతున్నారు. దీంతో ఆవైపు కన్నెత్తి చూసేందుకు సాహసించడంలేదు.

భారీగా దందా

చౌకదుకాణాల డీలర్ల నుంచి కిలోను రూ.15 నుంచి రూ.17కు కొనుగోలు చేస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని నెల్లూరులోని ఆరు.. కావలిలోని మూడు రైస్‌మిల్లుల్లో రీసైక్లింగ్ చేస్తున్నారు. పాలిష్ పట్టాక 25.. 50 కిలోల మేర ఆకర్షణీయమైన బ్యాగుల్లో నింపి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆపై కిలోను రూ.55 నుంచి రూ.60కు విక్రయిస్తున్నారు. రవాణా ఖర్చులు, అధికారులు, నేతలకు మామూళ్లు పోనూ కిలోకు రూ.పది మేర మిగులుతోందని తెలుస్తోంది. ఈ రకంగా ప్రతి నెలా రూ.కోట్లల్లో దందా జరుగుతోంది. ఇలా సంపాదించిన మొత్తంతో మాఫియా డాన్‌కు షిప్‌లో 20 శాతం వాటా ఉందని సమాచారం.

విచారణకు హాజరయ్యాం

పేదల బియ్యం అక్రమ రవాణా విషయమై విచారణకు రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ ఆదేశించారు. అడిగిన వివరాలను అందజేశాం. రాష్ట్ర అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టినా స్వాగతిస్తాం.

– విజయకుమార్, డీఎస్ఓ

రోజుకో అవినీతి బాగోతం

- నిన్న నకిలీ మద్యం.. నేడు రేషన్ బియ్యం అక్రమ రవాణా
- ధ్వజమెత్తిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నిన్న నకిలీ మద్యం.. నేడు రేషన్ బియ్యం అక్రమ రవాణా దందా.. ఇలా టీడీపీ నేతల బాగోతాలు రోజుకొకటి బయటపడుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. రేషన్ మాఫియాలో వాటాల పంపకాల్లో తేడాలు రావడంతో ఈ వ్యవహారాన్ని టీడీపీ నేత, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డే స్వయంగా బయటపెట్టారని చెప్పారు. మంత్రి నారాయణ అనుచరులే ఇందులో కీలకపాత్ర పోషిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో విచారణ చేయించాల్సింది పోయి.. మన తప్పులను మనమే బయటపెట్టుకుంటామా అంటూ ఆయన మండిపడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని చెప్పారు. అవినీతి సొమ్మును పంచుకోవాలే గానీ అల్లరి చేసుకోవద్దంటూ ఆయన కూటమి ధర్మంపై ఉపదేశాలిస్తుండటాన్ని చూస్తున్న జిల్లా ప్రజలు నివ్వెరపోతున్నారని చెప్పారు. జిల్లా కేంద్రంగా పచ్చ పార్టీ నేతలు సాగిస్తున్న ఈ దందాను తమ పార్టీ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు.

పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయించగలరా..?

రేషన్ మాఫియా వెనుక అధికార పార్టీకి చెందిన నేతలున్నారని, వీరికి సివిల్ సప్లయ్స్ అధికారులు వంతపాడుతున్నారని, వీటిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారన్నారు. మంత్రి నారాయణకు చెందిన ముఖ్య అనుచరులున్నారని ఆరోపించారని, పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఆయన వ్యాఖ్యల ద్వారా అర్థం చేసుకోవచ్చని చెప్పారు. అనంతసాగరానికి చెందిన వారు, నగరానికి చెందిన ముగ్గురు కలిసి నడిపిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి జిల్లాలో రేషన్ మాఫియా చెలరేగిపోతోందని, దీనికి అధికార పార్టీ నేతలే సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

యథేచ్ఛగా విదేశాలకు తరలింపు

జిల్లాలో దాదాపు తొమ్మిది వేల టన్నుల బియ్యం.. మాఫియా చేతుల్లోకి వెళ్లి అక్రమంగా రవాణా అవుతోందని ఆరోపించారు. జిల్లాలోని పలు రైస్‌మిల్లుల్లో నేరుగా రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి.. చెన్నై మార్కెట్‌కు.. కృష్ణపట్నం పోర్టు నుంచి విదేశాలకు తరలిస్తున్నారని చెప్పారు. ప్రజల పొట్టగొట్టి, అక్రమంగా తరలిద్దామనుకుంటే సహించేదిలేదని స్పష్టం చేశారు.

నారాయణా... ఏమిటీ బెదిరింపులు..?

టీడీపీ నేతలతో మంత్రి నారాయణ మాట్లాడిన ఆడియో రికార్డును వినిపించారు. ఆయన సొంత జిల్లాలో రేషన్ మాఫియా పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతోందనేది బహిరంగ రహస్యమని పేర్కొన్నారు. బాధ్యత గల హోదాలో ఉన్న ఆయన రేషన్ బియ్యం మాఫియాపై తనకు సమాచారమివ్వండి.. నిరోధిద్దాం అని చెప్పాల్సింది పోయి అందుకు విరుద్ధంగా వ్యవహరించారని విమర్శించారు. ఈ బెదిరింపులు ఏమిటని ప్రశ్నించారు. నెల్లూరు, వైఎస్సార్ కడప, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని మిల్లులను కూటమి పార్టీల నేతలు అద్దెకు తీసుకొని నడిపిస్తున్నారని, రేషన్ డీలర్ల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి, అక్రమంగా సరఫరా చేస్తున్నారని ఆరోపించారు.

సేవాసదన్‌లో లోటుపాట్లు సరిచేయండి

నెల్లూరు(పొగతోట): జిల్లాలోని సేవాసదన్‌లలో లోటుపాట్లను సరిచేసి పిల్లల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ ఆదేశించారు. నగరంలోని సేవాసదన్‌లో పిల్లలకిస్తున్న ఆహారం, నివాసం, ఆరోగ్యం, విద్యా తదితర సదుపాయాలను గురువారం పర్యవేక్షించారు. భద్రత చర్యలు, రికార్డులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. పిల్లల సంక్షేమం, భద్రత, ఆరోగ్యం, శారీరక, మానసికాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. డిస్ట్రిక్ట్ మిషన్ నోడల్ ఆఫీసర్ అనూరాధ, మహిళా ప్రాంగణ మేనేజర్ మాధవి, సేవా సదన్ ఇన్‌చార్జి అరుణ తదితరులు పాల్గొన్నారు.



బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న హేనాసుజన్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ గురువారం ఎక్కువగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయి. స్వామివారిని 79,919 మంది బుధవారం అర్ధరాత్రి వరకు దర్శించుకున్నారు. తలనీలాలను 28,218 మంది భక్తులు అర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.79 కోట్లను సమర్పించారు. టైమ్ స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన వారికి మూడు గంటల్లోనే దర్శనం లభిస్తోంది.

పారదర్శకంగా ఓటర్ల జాబితా నవీకరణ

నెల్లూరు రూరల్: ఓటర్ల జాబితా నవీకరణ పారదర్శకంగా నిరంతరం కొనసాగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. కలెక్టరేట్లోని తన చాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫారమ్ – 6ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. డీఆర్వో విజయ్‌కుమార్, టీడీపీ నేత రసూల్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వెంకట శేషయ్య, బీఎస్పీ నేత శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న హిమాన్షు శుక్లా

- కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు రూరల్: జిల్లాలో వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత, యాంత్రీకరణను సమ్మిళితం చేసుకుంటూ.. సరికొత్త ఆలోచనలతో రైతు ఉత్పత్తి సంఘాలను బలోపేతం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపునిచ్చారు. రైతు ఉత్పత్తి సంఘాల పురోగతిపై గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రైతు ఉత్పత్తి సంఘాలు 108 ఉన్నాయని, దీన్ని 150కు పెంచాలని ఆదేశించారు. ప్రతి ఎఫ్పీఓ పరిధిలో రైతుల అవసరాల మేరకు వ్యవసాయ యంత్ర పరికరాలను కొనుగోలు చేయాలని, దీనికి బ్యాంకులు సహకారం అందించాలని కోరారు. వరితో పాటు కూరగాయలు, పండ్లు, పూల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపర్చేందుకు, ఉత్తమమైన ప్యాకింగ్ విధానాలను అవలంబించేందుకు శిక్షణను ఇవ్వాలన్నారు. అనంతరం రైతు ఉత్పత్తి సంఘాలు తయారు చేసిన కొబ్బరి నూనె, తినుబండారాలను పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, మత్స్య, పశుసంవర్ధక శాఖల జేడీలు శాంతి, రమేష్‌నాయక్, నాబార్డు డీడీఎం బాబు తదితరులు పాల్గొన్నారు.

ఖనిజాన్వేషణ ఫలించేనా..?



లింగసముద్రం, వలేటివారిపాళెం మండలాల్లో కొద్ది రోజులుగా ఐరన్ ఓర్ కోసం జరుగుతున్న అన్వేషణ ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ఆధ్వర్యంలో రెండు నెలలుగా ఈ ప్రక్రియ జరుగుతోంది. అసలీ ప్రాంతంలో ఇనుప ఖనిజం ఉందా.. ఉంటే ఎంత శాతం.. నాణ్యత ఎంత అనేది చర్చనీయాంశంగా మారింది. మరో వైపు దీనిపై క్లారిటీ వచ్చేందుకు మరో మూడు, నాలుగు నెలల సమయం పడుతుందని సంస్థ ప్రతినిధులు చెప్తున్నారు. శాంపిళ్ల సేకరణే ప్రస్తుతం జరుగుతోందంటున్నారు.

- లింగసముద్రం, వలేటివారిపాళెం మండలాల్లో ఐరన్ ఓర్ కోసం యత్నాలు
- ఇదే అంశమై గత ప్రభుత్వ హయాంలో ప్రాథమిక నిర్ధారణ
- కనుగొనడంలో నిమగ్నమైన జేఎస్‌డబ్ల్యూ సాంకేతిక సిబ్బంది
- డ్రిల్లింగ్‌తో శాంపిళ్ల సేకరణ
- లభ్యతపై స్పష్టత కరువు

కందుకూరు: లింగసముద్రం, వలేటివారిపాళెం మండలాల పరిధిలోని భూముల్లో ఇనుప ఖనిజ నిక్షేపాలున్నాయనే అంశమై గత ప్రభుత్వ హయాంలో ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు అన్వేషణ చేపట్టే బాధ్యతలను జేఎస్‌డబ్ల్యూ సంస్థకు అప్పగించారు. దాదాపు 21.85 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కనుగొనేందుకు అనుమతిచ్చారు. ఈ క్రమంలో డ్రిల్లింగ్ యంత్రాలతో ఈ మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో తవ్వకాలను ప్రస్తుతం చేపడుతున్నారు. ప్రక్రియ రెండు నెలలుగా జరుగుతోంది.

ఆశించిన ఫలితాలు రాలేదా..?

లింగసముద్రం మండలంలోని తిమ్మారెడ్డిపాళెంలో శాంపిళ్ల సేకరణను పూర్తి చేసిన కంపెనీ ప్రతినిధులు అక్కడ ఆశించిన ఫలితాలు రాలేదని తెలియజేశారని సమాచారం. యర్రారెడ్డిపాళెం, అయ్యవారిపల్లి ప్రాంతాల్లో డ్రిల్లింగ్ చేసి ప్రస్తుతం సేకరిస్తున్నారు. అయితే ఈ అన్వేషణలో ఎంత శాతం మేర ఇనుప ఖనిజం ఉందనే అంశమై స్పష్టత రావడం లేదు. మరోవైపు శాంపిళ్ల సేకరణే ప్రస్తుతం జరుగుతోందని, వీటిని ప్రభుత్వ ఆధ్వర్యంలోని ల్యాబ్‌లలో పరీక్షించాల్సి ఉంటుందని జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ప్రతినిధులు చెప్తున్నారు. దీని తర్వాతే తదుపరి చర్యలుంటాయని పేర్కొంటున్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఊతం

ఇనుప ఖనిజ అన్వేషణను ఆసరాగా చేసుకొని ఇక్కడ భారీ స్టీల్ ప్లాంట్ వస్తుందంటూ ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బ్రోకర్లు భారీగా ప్రచారం చేస్తున్నారు. భూముల ధరలను పెంచి, వెంచర్లు వేసి విక్రయించే యత్నాల్లో తలమునకలై ఉన్నారు. ఇప్పటికే వెంచర్లు వేసి వ్యాపారాన్ని ప్రారంభించారు. వాస్తవానికి నిక్షేపాలను గుర్తించి.. నాణ్యతపై ఓ అంచనాకు వచ్చాకే స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై స్పష్టతొచ్చే అవకాశం ఉంటుంది. అయితే ప్రజాప్రతినిధులు మాత్రం రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ వస్తుందంటూ ప్రచారం సాగిస్తున్నారు. ఈ పరిణామాల క్రమంలో వాస్తవమేంటో ఇక్కడి ప్రజలకు అర్థం కాని పరిస్థితి నెలకొంది.

726 ఎకరాల అప్పగింత

ఐరన్‌ఓర్ ఖనిజ నిక్షేపాలపై స్పష్టత రాక ముందే, లింగసముద్రం, వలేటివారిపాళెం మండలాల్లోని పలు గ్రామాల పరిధిలో 726 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూములను మైనింగ్ కోసం ప్రస్తుత ప్రభుత్వం కేటాయించింది. లింగసముద్రం మండలంలోని తిమ్మారెడ్డిపాళెంలో 150.76.. ఆర్ఆర్‌పాళెంలో 21.. యర్రారెడ్డిపాళెంలో 3.46.. లింగసముద్రంలో 19.78 ఎకరాలను అప్పగించారు. వలేటివారిపాళెం మండలం చుండి, అయ్యవారిపల్లితో పాటు లింగసముద్రం మండలంలోని ఉట్లవారిపాళెం పరిధిలో 423 ఎకరాలను కేటాయించారు. మరో 111 ఎకరాల పట్టా భూములను ఐరన్‌ఓర్ ఖనిజ మైనింగ్‌కు ఇస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. దీంతో పాటు ప్రకాశం జిల్లాలోని పామూరు, పీసీపల్లి మండలాల పరిధిలో గల గ్రామాల్లోనూ అన్వేషణకు అనుమతులిచ్చారు. అయితే ఇందులో ఇనుప ఖనిజం ఎంత శాతం ఉందనే అంశంపై ఆధారపడే మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

ఖనిజ సంపద.. కొట్టేసేందుకు పెద్ద స్కెచ్

'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అనే సామెతలా అధికారంలో ఉండగానే అడ్డగోలుగా సంపాదించేందుకు కూటమి పెద్దలు రకరకాల స్కెచ్‌లు వేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ గనుల శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన రాయల్టీ బాధ్యతను 'ప్రైవేటు'పరం చేశారు.

రాయల్టీ బాధ్యత ప్రైవేట్‌కు అప్పగింత

- గనుల శాఖకు ఇకపై ఎటువంటి సంబంధం ఉండదు
- వసూళ్ల కోసం గూడూరులో అనధికారిక చెక్‌పోస్టులు
- ప్రైవేట్ సైన్యం గుప్పెట్లో సిలికా, గ్రావెల్, ఇసుక సంపద



చిల్లకూరు మండలం నల్లాయగారిపాళెం వద్ద ఏర్పాటు చేసిన గనులు, ఖనిజాల తనిఖీ కేంద్రం

సాక్షి టాస్క్‌ఫోర్స్: తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గం కోట, చిల్లకూరు, చిట్టమూరు, వాకాడు పరిధిలో సిలికా, గ్రావెల్, బ్లూమెటల్, ఇసుక సంపద పుష్కలంగా దొరుకుతాయి. దీనిపై కన్నేసిన కూటమి పెద్దలు ప్రైవేట్ సైన్యాన్ని రంగంలోకి దింపారు. అక్రమాలను అరికట్టేందుకు రాయల్టీ వసూళ్లను ప్రైవేట్ సంస్థలకు అప్పగించామని సాకు చెబుతూ దొడ్డి దారిలో రూ.కోట్లు కొల్లగొట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ సంపదంతా ఎక్కువ శాతం ప్రభుత్వ భూముల్లో ఉండటంతో చిన్నపాటి అనుమతి తీసుకుంటే చాలు. వాటిని చూపించి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి నుంచి తవ్వకాలు చేపట్టి రూ.కోట్లు కొట్టేయొచ్చు. ఇందులో భాగంగా ఏడాది కాలంగా కూటమి బ్యాచ్ గూడూరులో తిష్టవేసి ఖనిజ సంపద గురించి అన్వేషించారు. అయితే తెల్లరాయి, సిలికా తరలింపులు వివాదాస్పదంగా మారడంతో దీనిపై కూటమి ప్రభుత్వం తమకు అనుకూలంగా ఎవరైతే ఉంటారో వారికే సిలికా, ఇసుక, గ్రావెల్ (మైనర్ మినరల్) తరలించేలా అనుమతిచ్చింది.

గనుల శాఖ నిర్వీర్యం

ప్రభుత్వం ఎప్పటికప్పుడు గనుల శాఖ ఆధ్వర్యంలో మైనర్ మినరల్ తవ్వకాలు, తరలింపులకు సంబంధించి అన్ని అనుమతులిచ్చేది. అయితే కూటమి అధికారం చేపట్టిన తర్వాత ఆ శాఖను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా రాయల్టీ వసూళ్లకు అనుమతులను ఇచ్చింది. రెండేళ్లలో ప్రభుత్వానికి రూ.340 కోట్లు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఇక దొరికిందే తడవు నిబంధనలకు విరుద్ధంగా ఆ ఏజెన్సీ అంతకు రెండింతలు వసూలు చేయడం మొదలు పెట్టింది. అనుచరుల ద్వారా ప్రభుత్వ భూముల్లో అక్రమంగా తవ్వకాలు జరిపి తరలించేలా పక్కా ప్రణాళికలు రూపొందించుకున్నారు. సాధారణంగా సిలికా టన్నుకు రూ.307లు వసూలు చేసేవారు. ఇదే బయటి మార్కెట్‌లో రూ.3 వేలకుపైనే ఉంటుంది. మిగిలిన గ్రావెల్, ఇసుక, బ్లూమెటల్ పరిస్థితి కూడా దాదాపు అంతే. బయటి మార్కెట్‌ని దృష్టిలో ఉంచుకుని ఒక రాయల్టీ రసీదును చూపించి ఖనిజాన్ని అక్రమంగా తరలించి సొమ్ముచేసుకోవడం ప్రారంభించారు.

అనధికారిక చెక్ పోస్టులు

ప్రైవేట్ సైన్యం కన్నుగప్పి ఒక్క టన్ను కూడా బయటకు వెళ్లకుండా గూడూరు నియోజకవర్గ పరిధిలోని గొల్లపల్లి, తిప్పవరప్పాడు, చిల్లకూరు మండలంలోని నల్లయగారిపాళెం, చేడిమాల, అంకులపాటూరు, చింతవరం, వరగలి, కోట క్రాస్‌రోడ్డు, బూదనం రోడ్డు, కోట మండలం గూడలి, మెట్టు, కర్లపూడి, కేసవరం, రాఘవాపురం, కోట క్రాస్ రోడ్డు, వాకాడు మండలంలో బాలిరెడ్డిపాళెం, వాకాడు బ్యారేజ్, చిట్టమూరు మండలంలో మెట్టు, చిట్టమూరులో అనధికారిక చెక్ పోస్టులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా పొందిన రాయల్టీ రసీదు చూపిస్తే వాహనాలకు అనుమతి ఉంటుంది. లేదంటే ఫైన్, కేసులు ఇతరత్రా వేధింపులు తప్పవు.

చిల్లకూరులో పోటీ కార్యాలయం

గనులకు సంబంధించి అధికారిక కార్యాలయాలు, చెక్‌పోస్టులు ఉంటాయి. ప్రైవేట్ ఏజెన్సీల పుణ్యమా అని వారే చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉంటే గూడూరు నెల్లూరు జిల్లాలో ఉన్న సమయంలో గనుల శాఖ కార్యాలయం పూర్తిగా అక్కడే ఉండేది. జిల్లాల మార్పుతో గూడూరు నియోజకవర్గంలో ఎక్కువగా మైనర్, మేజర్ మినరల్ దొరుకుతుండటంతో చిల్లకూరులో గనుల శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మైనర్ మినరల్ రాయల్టీ వసూళ్లను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించడంతో వారు చిల్లకూరులో అనధికారికంగా గనుల శాఖ కార్యాలయం ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇకపై ఎవరైనా సిలికా, ఇసుక, గ్రావెల్, నల్ల, బ్లూ కంకరను తరలించాలంటే ఇక్కడ రాయిల్టీ చెల్లించి అనుమతులు తీసుకున్న తర్వాతనే తరలించాల్సి ఉంటుంది.


తనిఖీ కేంద్రం వద్ద ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు

ఏజెన్సీలే చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలి

మైనర్ మినరల్ తవ్వకాలు, తరలింపులకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం ఏఎంఆర్ అనే ఏజెన్సీతో ప్రతి టన్నుకు రాయిల్టీ చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. దీంతో ఏజెన్సీకి చెందిన వారు పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసుకుని తనిఖీలు చేస్తూ అనుమతులున్న వాహనాలకు మాత్రమే పంపేలా చేస్తున్నారు. ఇది మొత్తంగా ప్రైవేట్ ఏజెన్సీకి చెందిన విషయం.

– శ్రీనివాసరావు, గనుల శాఖ ఏడీ

క్లుప్తంగా

శ్రీగంధం చెట్ల నరికివేత



ఉదయగిరి రూరల్: మండలంలోని కొండాయపాళెం పంచాయతీ మాసాయిపేట బీసీ కాలనీ సమీపంలో ఉన్న గానుగపెంటపల్లి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి అనే రైతు పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు శ్రీగంధం చెట్టు నరికి తీసుకెళ్లారు. గురువారం ఆయన మాట్లాడుతూ తన వ్యవసాయ పొలంలో 35 ఏళ్ల నుంచి శ్రీగంధం చెట్లు సాగు చేస్తున్నట్లు చెప్పారు. మూడేళ్ల క్రితం కూడా తోటలో 16 చెట్లు నరికి తీసుకెళ్లారన్నారు. అలాగే ఈనెల 8న ఒక చెట్టును నరికి తీసుకెళ్లగా పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. తాజాగా బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రెండు చెట్లను నరికారని, ఒక చెట్టు దుంగను తీసుకెళ్లినట్లు చెప్పారు. పోలీసులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

అదుపుతప్పి.. రోడ్డుకు అడ్డుగా నిలిచి..

- డివైడర్ కోసం పెట్టిన రాళ్లను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- తప్పిన ప్రమాదం
- 2 కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్


బస్సును పక్కకు తొలగిస్తున్న దృశ్యం

దగదర్తి: మండలంలోని అల్లూరు రోడ్డు రైల్వే బ్రిడ్జి జాతీయ రహదారిపై గురువారం వేగంగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి డివైడర్ కోసం ఏర్పాటు చేసిన రాళ్లను ఢీకొంది. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో బోల్తా పడకుండా రహదారికి అడ్డుగా నిలిచిపోయింది. అందులో ఉన్న ప్రయాణికులకు ఏమీ కాలేదు. రెండు లేన్ల రహదారి కావడం.. అడ్డు గా బస్సు నిలిచిపోవడంతో సుమారు రెండు కిలోమీటర్ల మేర ఇరు వైపులా ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న ఎస్సై జంపాని కుమార్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో బస్సును పక్కకు తొలగించారు. ఈ ప్రదేశంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా హైవే అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. డివైడర్ కోసం ఏర్పాటు చేసిన రాళ్ల రాత్రి వేళల్లో కనిపించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

19న ఎల్‌ఐసీ ఏఓఐ డివిజన్ మహాసభ




మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(అర్బన్): ఎల్‌ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా నెల్లూరు డివిజన్ (నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలు) 6వ మహాసభ ఈనెల 19వ తేదీన కందుకూరులోని యూటీఎఫ్ భవన్‌లో జరుగుతుందని ఆ సంఘం రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫ్లెక్సీలను గురువారం నెల్లూరు దర్గామిట్టలోని డివిజన్ కార్యాలయం వద్ద, అలాగే సిటీ బ్రాంచ్ – 1 కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. రాజశేఖర్ మాట్లాడుతూ ఎల్‌ఐసీలో జీఎస్టీ ఎత్తేయడానికి ప్రధాన కారణం ఏఓఐ చేసిన పోరాటాలేనన్నారు. అలాగే ఎల్‌ఐసీలో పెట్టుబడులు ఉపసంహరించుకోవడానికి వ్యతిరేకంగా, ఏజెంట్ల కమీషన్ తగ్గించడం ఒప్పుకోమంటూ చిత్తశుద్ధితో పోరాటాలు చేసింది తమ ఏఓఐ సంఘమన్నారు. ప్రజల ప్రీమియానికి భద్రత ఉండాలంటే ఎల్‌ఐసీ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలన్నారు. నాయకులు హజరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 59.910 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 59.910 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 4,000 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కాగా కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,050, పిన్నేరు కాలువకు 300, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 200, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	రూ.125
లేయర్	రూ.122
బ్రాయిలర్ చికెన్	రూ.226
స్కిన్‌లెస్ చికెన్	రూ.250
లేయర్ చికెన్	రూ.207

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.30
సన్నవి	రూ.20
పండ్లు	రూ.10

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- వీరి చలపతితో ములాఖత్


మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయాన్ని కూటమి నేతలు గుర్తుంచుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి హితవు పలికారు. కూటమి ప్రభుత్వం మోపిన అక్రమ కేసులతో చెముడుగుంట సమీపంలోని జిల్లా కేంద్ర కారాగారంలో ఉన్న డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతితో గురువారం ములాఖత్ అయ్యారు. అనంతరం విలేకరులతో కాకాణి మాట్లాడారు. ప్రశ్నించే వారిని లక్ష్యంగా చేసుకొని అక్రమ కేసులు పెడుతూ జైలుకు పంపడం ఆనవాయితీగా మారిందని విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దళిత నేతగా వీరి చలపతి ఎదగడాన్ని ఓర్వలేక అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని ఆరోపించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసేతత్వం గల ఆయనపై అన్యాయంగా కేసులు పెట్టడం దారుణమన్నారు. చేయని తప్పునకు శిక్ష అనుభవిస్తున్న చలపతి.. జైల్లో ధైర్యంగా ఉన్నారని పేర్కొన్నారు. కోవూరు నియోజకవర్గంలోని ప్రధాన నేతలతోపాటు మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డిని కేసుల్లో ముద్దాయిలుగా చేర్చడం హేయమైన చర్యగా అభివర్ణించారు. తమ పార్టీ నేతలపై కేసులు పెట్టి వేధించడం, సహజ వనరులను దోపిడీ చేయడం మినహా అభివృద్ధి చేస్తున్న దాఖలాల్లేవని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చేంత వరకు పోటారాలను ఆపే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. అక్రమ కేసులు, జైళ్లు తమను ఆపలేవనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. తమ పార్టీ శ్రేణులపై జరిగే అన్యాయాలు, దాడులను నమోదు చేసేందుకు గానూ డిజిటల్ బుక్‌ను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని వివరించారు. కూటమి ప్రభుత్వంలో తమ పార్టీకి చెందిన కుటుంబాలను మానసిక వేదనకు గురిచేస్తున్నారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంతకు రెండింతలు అనుభవించే పరిస్థితులు ఏర్పడతాయని స్పష్టం చేశారు. వీరి చలపతి కేసులో న్యాయస్థానాన్ని ప్రసన్నకుమార్‌రెడ్డి ఇప్పటికే ఆశ్రయించి, అన్ని సహాయ, సహకారాలను అందిస్తున్నారని చెప్పారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాటూరు పంచాయతీలో సీపీయూ మాయం

కోవూరు: మండలంలోని పాటూరు గ్రామ పంచాయతీ కార్యాలయానికి చెందిన సీపీయూ, మానిటర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. పంచాయతీ సిబ్బంది గురువారం ఉదయం కార్యాలయానికి వచ్చారు. కంప్యూటర్‌కు సంబంధించిన వస్తువులు కనిపించకపోవడంతో పోలీసులకు పంచాయతీ కార్యదర్శి సుగుణమ్మ ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బుధవారం అర్ధరాత్రి దుండగులు పంచాయతీ గది తలుపు తొలగించి లోనికి ప్రవేశించి వాటిని ఎత్తుకెళ్లినట్లు భావిస్తున్నారు. సీపీయూలో పంచాయతీకి సంబంధించిన ముఖ్యమైన రికార్డులు, పన్ను వివరాలు, ఆస్తి రిజిస్టర్ డేటా, ఇతర సమాచారం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా కొందరి లావాదేవీలకు సంబంధించిన విలువైన డేటా ఉందని, ఈ నేపథ్యంలో దొంగతనం జరిగి ఉండొచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాత బిల్లులు, పత్రాలు అలాగే ఉన్నాయి. దొంగలు కేవలం సీపీయూ, మానిటర్ మాత్రమే తీసుకెళ్లారు. కార్యాలయ పరిసరాల్లో ఉన్న సీసీ టీవీ ఫుటేజీని సేకరించి దర్యాప్తు ప్రారంభించామని ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు.

ఒకటే వాన


చిన్నారిని తీసుకెళ్తూ..


నెల్లూరులోని ఆరెస్సార్ స్కూల్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో గురువారం భారీ వర్షాలు నమోదయ్యాయి. మర్రిపాడు, ఆత్మకూరు, కలువాయి, పొదలకూరు, కలిగిరి, వింజమూరు, సంగం, బుచ్చి, కోవూరు, విడవలూరు, కొడవలూరు, వెంకటాచలం, మనుబోలు, తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట తదితర మండలాలతోపాటు నెల్లూరులో వానలు కురుస్తున్నాయి. కొన్ని మండలాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు నమోదు కాగా మరికొన్నిచోట్ల తేలికపాటి, మోస్తరు వర్షాలు పడుతున్నాయి. ఆకాశం మేఘావృతమై ముసురు పట్టింది. మరో రెండురోజులుపాటు జిల్లాలో వానలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

నెల్లూరు నగరంలో..

జిల్లా కేంద్రం నెల్లూరు నగరంలో బుధవారం అర్ధరాత్రి నుంచే వానలు మొదలయ్యాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు విడతల వారీగా భారీ వర్షం నమోదైంది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. ఆర్టీసీ కాలనీ, చంద్రబాబునగర్, కొత్తూరు, జనార్దనరెడ్డి నగర్, కల్యాణి నగర్, మనుమసిద్ధి నగర్, శివగిరి కాలనీ, రాజీవ్‌గాంధీ గృహకల్ప తదితర పలు పల్లపు ప్రాంతాల్లో నీరు చేరిపోయింది. ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి, మాగుంట లేఅవుట్ అండర్‌బ్రిడ్జి, విజయమహల్ గేటు బాక్సు టైపు బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో నీరు చేరింది. పొగతోట, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ, ఆచారి వీధి తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీ కూడిన వర్షపు నీరు పొంగి ప్రవహించింది. దీంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. కార్మికులకు పనులు దొరక్క అవస్థలు ఎదుర్కొన్నారు. ఇబ్బంది పడ్డారు.


పెట్రోల్ బంకులో ఉన్న జనం


నెల్లూరులో కురుస్తున్న వర్షం

రిలీవ్ చేయాలంటూ ధర్నా

నెల్లూరు(టౌన్): ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన బదిలీల్లో పక్క పాఠశాలలకు ట్రాన్స్‌ఫర్ అయినా నేటికీ రిలీవ్ చేయలేదని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డీఈఓ బాలాజీరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిలీవ్ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులు కేటాయిస్తామని, డీఎస్సీ నుంచి వచ్చిన టీచర్లను కేటాయిస్తామని 5 నెలల నుంచి చెబుతూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతి, సుష్మా, బ్యూలా, సుభాషిణి, సుమ, శోభారాణి పాల్గొన్నారు.


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు